ప్రజల చెంతకే సంక్షేమం



సిమెంటు రోడ్డు కల్వర్టు నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, తదితరులు



నెల్లూరుపాళెం కాలనీల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుతున్న మహిళలు

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనతో విప్లవాత్మక మార్పు తెచ్చారని, నేరుగా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్న తీరు దేశానికి ఆదర్శంగా ఉందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఇది కేవలం సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారానే సాధ్యమైందన్నారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్సీ, ఎస్టీ కాలనీలు, మైనార్టీ కాలనీల్లో శుక్రవారం విజయీభవ యాత్ర నిర్వహించారు. కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి మేళతాళాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తొలుత బీసీకాలనీలో రూ.20.40 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైయిన్లు, కల్వర్టుల పనుల శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం సెంటర్‌లోని దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాతో 23వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్టీ కాలనీలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలతో ఆయన సంక్షేమ పథకాలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఎస్సీ కాలనీలో పర్యటించి మైనార్టీ కాలనీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ 23వ వార్డులో పలు అభివృద్ధి పనులు కోసం సుమారు రూ.20 కోట్లు మంజూరు చేయించి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పనుల కోసం రూ.17.29 కోట్లు, జగనన్న లేఅవుట్ అభివృద్ధి కోసం రూ.1.85 కోట్లు, సొంత స్థలాలు కలిగిన వారి ఇళ్ల నిర్మాణాల కోసం రూ.34.1 లక్షలు ప్రభుత్వం ద్వారా అందినట్లు ఎమ్మెల్యే వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.20.4 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణం జరిగినట్లు ఆయన తెలిపారు. ప్రతి వార్డును అభివృద్ధి చేసేందుకు ముందుగానే మేనిఫెస్టోను సిద్ధం చేసి ఫ్లెక్సీ రూపంలో ఆయా వార్డుల్లో ఏర్పాటు చేయనున్నట్లు విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఈ వార్డు పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్‌లోని ముంబయి రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

వార్డు పరిధిలో విజయీభవ యాత్ర చేస్తున్న క్రమంలో షేక్ మహబూబ్‌బాషా అనే వృద్ధుడికి బ్రెయిన్ స్ట్రోక్‌తో కళ్లు కనిపించక ఆ కుటుంబ దయనీయ పరిస్థితిని తెలుసుకుని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి రూ.50 వేలు సొంత నిధులను అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతరం మాజీ కౌన్సిలర్ సీహెచ్ పద్మావతమ్మ నివాసానికి వెళ్లి ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

రేషన్, కుల ధ్రువీకరణ కార్డులు పంపిణీ

రాకపోవడంతో వాటిని సరి చేయించి విజయీభవ యాత్ర సభలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. దాసరి దొరసానమ్మ అనే గిరిజన వితంతువుకు ఆ 'దాసరి' ఇంటి పేరు గిరిజనులకు ఉండదని సాంకేతిక కారణాలను ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆ సమస్య పరిష్కరించి ఆమెకు కుల ధ్రువీకరణ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు రమాదేవి, నౌషాద్, పెంచలయ్య, గంధళ్ల వేణు, రాజశేఖర్, పార్టీ నాయకులు ఐవీ రమణారెడ్డి, షేక్ పర్వీన్, శ్రీనివాసులు నాయుడు, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కేతా రవి, కరుణాకర్, జమీర్, రహీం, కలాం, మణి, పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బేరీజు వేసుకుని తీర్పునివ్వండి

రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా కులమతాలు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకే చేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి, గత ప్రభుత్వం పనితీరుతో బేరీజు వేసుకొని మేలు జరిగి ఉంటే జగనన్న పాలనకు మద్దతునిస్తూ ఎన్నికల్లో తీర్పునివ్వాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రజలను కోరారు. రాష్ట్రంలో మహిళలకు, రైతులకు ఇచ్చిన మాట మేరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి గుండెల్లో స్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. నాడు-నేడుతో, అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం, తదితర పథకాలతో విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొని వచ్చారని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మార్పు చెందడంతో హాజరు శాతం పెరిగిన విషయాన్ని గమనించాలన్నారు. వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షలు ఉచిత వైద్యం అందిస్తున్నారని, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లు, జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రత్యేకంగా కంటి వైద్య పరీక్షలు, తదితర వాటితో ప్రజల ముంగిటకే ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రజలు తీర్పునివ్వాలని ఆయన కోరారు. మేలు జరిగిన ప్రజలే సైనికుల్లా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఫ్యాన్ గుర్తు చూపుతూ జగనన్నను ఆశీర్వదించాలని కోరుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, తదితరులు

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు రోడ్డు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా కనుపూరుపల్లి వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ రోడ్డు గత టీడీపీ హయాం నుంచి అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు, అనేక ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని అధికారులు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఇటీవల ఆయా గ్రామాల్లో విజయీభవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు దుస్థితిని స్వయంగా చూసిన విక్రమ్‌రెడ్డికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు వినతి చేశారు. దీంతో పీఎంజీఎస్‌వై పథకంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆత్మకూరు-బట్టేపాడు రోడ్డు నుంచి కనుపూరుపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణం అతి త్వరలో పూర్తవుతుందని, ఈ రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. ఈ పనులను తాము పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నల్లపరెడ్డిపల్లి, మురగళ్ల, కనుపూరుపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్ల వెంకురెడ్డి, ఏడెం పెంచలరెడ్డి, ఏడెంశ్రీనివాసులు రెడ్డి, శంకరయ్య యాదవ్, పువ్వాడి శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నల్లపరెడ్డిపల్లి-కనుపూరుపల్లి రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు

జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ

- ఎంవీఐ రాములు

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని రవాణాశాఖ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు ప్రధానంగా మద్యం తాగడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడమే అన్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడం లేదా క్షతగాత్రులు అయితే జీవితాంతం నరకమేనన్నారు. విద్యార్థులు సైతం ద్విచక్ర వాహనాలపై ఇష్టారీతిగా వ్యవహరిస్తూ వాహనాలు నడుపుతారని, దీని వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన విషయాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకట రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

కలిగిరి: కలిగిరి పంచాయతీలో పలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రి రెడ్డి శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరి కొండారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా మస్తాన్‌రెడ్డి, స్థానిక నాయకులు సుద్దల మోహన్, బండారు మనోహర్, ఖాజామైనుద్దీన్, సుద్దల శ్రీను పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఉదయగిరి: ఐరన్ వెల్డింగ్ దుకాణంలో కాటాను పరిశీలిస్తున్న అధికారులు



మర్రిపాడు: తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు

ఉదయగిరి: దుకాణదారులు వినియోగదారులను తూనికలు, కొలతల్లో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.ఐజాక్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో మూడు బృందాలుగా ఏర్పడి దుకాణాలపై దాడులు చేసి కాటాలను పరిశీలించారు. ఉదయగిరిలోని 13 దుకాణాలపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎలక్ట్రానిక్ కాటాలకు ప్రతి ఏడాదికోసారి చెక్‌చేయించుకొని సీల్, వేయించుకోవాలన్నారు. నాన్ ఎలక్ట్రానిక్ కాటాలకు రెండేళ్లకోసారి ముద్ర వేయించాలన్నారు. పలు దుకాణాల్లో కాటాల్లో మోసం జరుగుతున్నట్లు గుర్తించి వారికి అపరాధ రుసుం విధించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు కరీముల్లా, రాందాస్, అనిల్, తదితరులున్నారు.

తూనికలు, కొలతల శాఖాధికారుల తనిఖీలు

మర్రిపాడు: మర్రిపాడులోని పలు దుకాణాల్లో శుక్రవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చికెన్, కూరగాయలు, ప్రొవిజన్ స్టోర్లలో విస్తృతంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో వ్యాపారులు తుకాల్లో కొలతల్లో మోసాలను గుర్తించారు. తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న 11 దుకాణాలతో పాటు కాటాలకు సీల్ వేసి కేసులు నమోదు చేశారు. దుకాణదారులు కొలతల్లో మోసాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు హెచ్చరించారు.

దురుద్దేశంతో టీడీపీ నేతల దుష్ప్రచారం

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణ సహించలేని టీడీపీ నాయకులు దురుద్దేశపూర్వకంగా పచ్చ పత్రికల్లో విష ప్రచారాలు చేయిస్తున్నారని మండలంలోని మురగళ్ల సర్పంచ్ పువ్వాడి హరిత, ఆమె భర్త శ్రీనివాసులునాయుడు పత్రికా ప్రకటనలో ఖండించారు. చెరువు నుంచి సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ఆయకట్టుదారులైన రైతులు ఏటా ఒక్కో ఎకరాకు రూ.2 వేలు చొప్పున చందాలు వేసుకుని పంట కాలం మొత్తం సజావుగా సాగునీరు ప్రతి ఎకరాకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే మురగళ్ల టీడీపీ నాయకులు ఈ పద్ధతిని ఓర్వలేక ఐదేళ్లుగా తమ పొలాలకు సంబంధించిన నిర్వహణ ఖర్చులు ఇవ్వకుండా అడ్డు తగులుతున్నారన్నారు. మురగళ్లలో ఎస్సీలు మత్స్యకార సొసైటీ ద్వారా చేపల పెంపకం చేస్తున్నారని, దీన్ని సైతం అడ్డుకుని ఎస్సీల కడుపు కొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎస్సీ కుటుంబాలపై టీడీపీ నాయకులు కుట్రపూరిత ప్రచారం చేస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇటీవల మత్స్యకార సొసైటీ నిర్వాహకులు అమర్చిన పైపులను కూడా ధ్వంసం చేసి నష్టం కలిగించేందుకు ప్రయత్నించారన్నారు. దీనిపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాలను వైఎస్సార్‌సీపీ తరఫున తాము ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

బ్యాంకర్లు నూరు శాతం లక్ష్యాలు సాధించాలి

- ఎల్‌డీఎం ప్రదీప్‌కుమార్

ఉదయగిరి: ఉదయగిరి క్లస్టరు పరిధిలోని వివిధ బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లు స్వయం సహాయ సంఘాల సభ్యులకు, రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. రికవరీ శాతం పెంచాలన్నారు. పీఎంజీపీ లోన్ల మంజూరులో ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గోదాముల నిర్మాణానికి 25 నుండి 33 శాతం రాయితీ ఉంటుందని, వాటిని ప్రోత్సహించాలని, పశు కిసాన్ క్రెడిట్ కార్డును పశుపోషక కుటుంబాలు ఉపయోగించుకోవాలన్నారు. డిపాజిట్ల సేకరణలో ఉదయగిరి క్లస్టరు 152 శాతంలో ఉందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం రవిసింగ్, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎల్డీఎం ప్రదీప్‌కుమార్

నేడు విజయ సంకల్పయాత్ర

కలిగిరి: మండలంలోని కుమ్మరకొండూరు, పరికోట పంచాయతీల్లో శనివారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువనేత అభినవ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విజయ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హౌసింగ్ సెంట్రల్ టీం పరిశీలన



జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యుడు షేక్ కరిముల్లా

అల్లూరు: హౌసింగ్ స్కీంకు సంబంధించి సెంట్రల్ క్వాలిటీ అండ్ కంట్రోల్ టీం సీనియర్ ఇంజినీర్ షేక్ కరిముల్లా శుక్రవారం మండలంలోని జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కొంత మంది పూర్తిగా ఇళ్లను నిర్మించుకుని గృహప్రవేశాలు కూడా చేశారన్నారు. మిగతా వాటిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ షేక్ ఖాజామొహిద్దీన్, ఇన్‌చార్జి ఏఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు పంట క్షేత్ర పరిశీలన

మర్రిపాడు: కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సస్యరక్ష శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నువ్వు పంటలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. నువ్వు పంటను ఆశించే బూడిద తెగులు, వెర్రి తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మాంకోజెబ్, ఇమిడాక్లోప్రిడ్, నీటిలో కరిగే గంధకం మందులను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మండల ఏఓ రామ్మోహన్, బూదవాడ వ్యవసాయ అధికారి మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.



క్షేత్ర ప్రదర్శనలో అధికారులు

ప్రతిష్ట మహోత్సవాల్లో విశేష హోమాలు



విశేష హోమాలు నిర్వహిస్తున్న దంపతులు

వరికుంటపాడు: వరికుంటపాడు సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి, శ్రీగోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి నూతన ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రుత్వికులు విశేష హోమాలు నిర్వహించారు. ఉదయం యాగశాల ద్వారా తోరణం, ధ్వజకుంభారాధన, అగ్నిప్రణయనం, విశేష హోమాలు నిర్వహించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో అధికారులు, నాయకులు

మర్రిపాడు: ప్రతి కుటుంబానికి రూపాయి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య లక్ష్యమని జేసీఎస్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిలకపాడులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఎంపీడీఓ, వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ హజరత్‌రెడ్డి, ఏపిలగుంట సర్పంచ్ భూమన నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



ఏటూరులో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

చేజర్ల: మండలంలోని ఏటూరు గ్రామంలో ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గ్రామానికి చెందిన సోమవరపు జయరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు విశాల్‌రెడ్డి శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కళాధర్, మస్తానయ్య, ఆదూరుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రమేష్‌బాబు, ఏటూరు హెచ్ఎంలు ఎస్ రమణయ్య, ఏ సుబ్రహ్మణ్యం, సీఆర్పీ శ్రీనివాసులు, భరద్వాజ, నాయకులు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులను త్వరగా పంపిణీ చేయాలి

చేజర్ల: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు త్వరగా పంపిణీ చేయాలని డీఎల్‌డీఓ రమణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని పాతపాడు సచివాలయ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. పంపిణీ చేసే కార్డులకు ఈకేవైసీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రత పూజలు



సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో దంపతులు

సంగం: స్థానిక చెక్‌పోస్టు సెంటర్ ఎస్సీ కాలనీలో కొలువైన మాతా పరమేశ్వరి ఆలయంలో రమాదేవి సమేత సత్యనారాయణస్వామి వ్రత పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మాఘమాసం రథ సప్తమి సందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కాలనీలోని పలువురు దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తప్పిన పెనుప్రమాదం



సోమశిల: అనంతసాగరం ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. హెవీ లోడ్‌తో వెళ్తున్న లారీ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర స్తంభం నుంచి ఇంట్లోకి విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన వైరు తగులుకుంది. దీంతో విద్యుత్ తీగలు తెగిపోయి, స్తంభం ఒరిగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లు అయింది.

నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్లకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని వైకుంఠపురంలో రెండు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గత 15 ఏళ్లగా విద్యుత్ అంతరాయంతో వైకుంఠపురం ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలోని టీడీపీ పాలకులు పట్టించుకులేదని ఆ ప్రాంతం మాజీ కౌన్సిలర్ గుడ్లూరు మాల్యాద్రి చెప్పారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు రోడ్లు నిర్మించారన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్న పేదలకు రూ.14 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్‌లను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి శుక్రవారం అందజేశారు. స్థానికంగా తన నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. కావలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.3.5 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసి పేదలను ఆదుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

వృద్ధురాలి ప్రాణం కాపాడిన యువకులు

సోమశిల: మండలంలోని పాతదేవరాయపల్లిలో వృద్ధురాలు గుర్రం విజయమ్మను శుక్రవారం ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. గమనించిన యువకులు నరేంద్ర, నిశాంత్, మధు ఆమె ప్రాణాలు కాపాడారు. దీంతో యువకులకు కుటుంబ సభ్యులతో గ్రామస్తులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

చేజర్ల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులను కల్పించాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూపర్‌వైజర్లు, వీఆర్వోలకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఆదూరుపల్లి, నాగులవెలటూరు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. రోడ్డు మార్గం, వసతి సౌకర్యం, నీటి సౌకర్యం, కరెంట్ ఉండాలన్నారు. ఆయన డీటీ విజయ్ పాల్గొన్నారు.